బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 24 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4

## నేడు నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం రేవంత్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరగనున్న నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొననున్నారు. అయితే, 2018 తర్వాత ఈ సమావేశానికి హాజరవుతున్న తొలి తెలంగాణ సీఎం ఆయనే కావడం విశేషం. తెలంగాణలో 2047 నాటికి సాధించదల్చుకున్న లక్ష్యాలు, సుపరిపాలన విధానాలతో పాటు సమగ్రాభివృద్ధికి కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలపై శనివారం ఢిల్లీలో జరగనున్న నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిప్రత్యేక నివేదికను సమర్పించనున్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పెట్టుబడుల సాధన, మౌలిక వసతుల అభివృద్ధికి తెలంగాణ రైజింగ్ విజన్‌తో ముందుకు సాగుతున్న తీరును, 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడానికి నిర్ధేశించుకున్న లక్ష్యాలను సమగ్రంగా వివరిస్తారు. 'వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్ 2047' ఎజెండాతో ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. 2018 తర్వాత తొలిసారిగా తెలంగాణ ముఖ్యమంత్రి నీతిఆయోగ్ మిగితా 2వ పేజీలో

# ఎన్నికల సమయంలోనే రాజకీయాలు



- అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని పనిచేస్తాం
- రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎన్నిసార్లయినా ప్రధాని మోదీని కలుస్తా
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరం
- మెదక్ పేరు తలచుకుంటే ఇందిరా గాంధీ గుర్తుకొస్తారు
- సీఎం రేవంత్ రెడ్డి
- సంగారెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో తెలంగాణను ప్రపంచంలోనే ఒక గొప్ప ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించేది లేదని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోనని, అందుకు అండగా నిలబడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ , స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

జహీరాబాద్ నిమ్జ్ కోసం భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారికి ఆదేశాలిచ్చారు.గత పదేళ్ల కాలంలో జహీరాబాద్ నిమ్జ్ పూర్తిగా కుంటుపడిందని చెబుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచి భూ సేకరణను వేగవంతం చేశామన్నారు. హ్యూందయ్ సంస్థ త్వరలోనే ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించనుందన్న శుభవార్తను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. రైతులంతా కలిసి సహకార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నడిపిస్తామంటే చెక్కర కర్మాగారం ఏర్పాటుకు నిమ్జ్‌లో వంద ఎకరాలు కేటాయించి అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు.

జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలు. ఆ తర్వాత అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని పనిచేస్తామని, అభివృద్ధి, రాష్ట్రానికి రావలసిన నిధుల విషయంలో ఎన్నిసార్లయినా ప్రధానమంత్రి మోదీ గారిని కలుస్తానని పునరుద్ఘాటించారు.మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారు మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ చేసిన అనేకానేక అభివృద్ధి కార్యక్రమాలు, ఈ జిల్లాతో ఉన్న విడదీయలేని అనుబంధాన్ని వివరించారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తోందని చెప్పారు.

ప్రభుత్వం రైతు, మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని.. రుణ విముక్తులను చేయడానికి రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సహాయం కింద రైతు భరోసాను 10 నుంచి 12 వేలకు పెంపు, మద్దతు ధరతో పాటు ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లింపు, భూమిలేని వ్యవసాయ నిరుపేదలకు 12 వేల చొప్పున సహాయం అందిస్తున్న విషయాలను ముఖ్యమంత్రి వివరించారు. మహిళల కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరంగా తెలియజేశారు. వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవడానికి నిర్ధేశించుకున్న కార్యక్రమాలను విశదీకరించారు.

జహీరాబాద్ పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొనడానికి ముందు ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన పెట్రోల్ పంపును ప్రారంభించారు. అక్కడే మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వారి ఉత్పత్తులను పరిశీలించారు. సభా వేదికగా సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్యకు బ్యాంకు లింకేజీ కింద రూ. 126.54 కోట్లు, మెప్మా కింద 17.51 కోట్లకు సంబంధించి చెక్కును అందజేశారు. జిల్లాలో రూ. 494.67 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు లోక్‌సభ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ గారు, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి గారు, షబ్బీర్ అలీ గారు, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




### విశ్వగురు శ్రీ బసవేశ్వరుడి స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది

విశ్వగురు శ్రీ బసవేశ్వరుడి స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మిగితా 2వ పేజీలో

## తెలంగాణలో తొలి కరోనా కేసు

- కూకట్‌పల్లిలో డాక్టర్‌కు కోవిడ్ పాజిటివ్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో తొలి కరోనా కేసు నమోదైంది. మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని వివేకా నంద నగర్‌కు చెందిన ఓ వైద్యునికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్టు అధికారులు ధ్రువీకరించారు. కూటక్‌పల్లిలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో పల్మనాలజిస్ట్‌గా పని చేస్తున్న ఆ వైద్యుడు నిత్యం రోగులకు ఓపీ చూస్తుండేవారు. ఈ సమయంలో రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో అనుమానం వచ్చి ఆర్టీపీసీఆర్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చింది. ఈ విషయాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డార్టర్ సి.ఉమాగౌరీ అధికారికంగా ధ్రువీకరించారు. కాగా ఆ వైద్యుడు ఐదు రోజులుగా కోవిడ్ ఐసోలేషన్‌లో ఉన్నారు. కాంటాక్ట్ ట్రేసింగ్ చేయగా.. ఇప్పటి వరకు వాళ్ల కుటుంబ సభ్యులు, ఇతరుల్లో ఎలాంటి లక్షణాలు కనిపించలేదు. ప్రస్తుతం ఆ వైద్యుడికి ఎలాంటి లక్షణాలు లేవు. పూర్తిగా కోలుకున్నారు. నియంత్రణ చర్యలు పాటించాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు, వైద్య అధికారుల పర్యవేక్షణలో ఉన్నారు.

మరోవైపు ఏపీలోనూ కరోనా వైరస్ విస్తరిస్తున్నది. అక్కడ రెండు కేసులు నమోదయ్యాయి. తొలుత వైజాగ్ మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. చలిజ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కొవిడ్ 19గా తేలింది.. అలాగే నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు గత రాత్రి కరోనా పరీక్షలు చేయగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.

## లేఖ నేనే రాశా

- సొంత ఎజెండా ఏమీ లేదు
- కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దయ్యాలు.. పార్టీలో కోవర్టులు ఉన్నారు
- తెలంగాణలో బీజేపీ కాంగ్రెస్‌లు ఫెయిల్
- లేఖ బహిర్గతం వెనుక ఎవరున్నారో తెలియాలి
- ఎమ్మెల్సీ కవిత



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పార్టీలో నెలకొన్న పరిణామాలు, వరంగల్‌లో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభలో పాజిటివ్, నెగటివ్ అంశాలపై మాజీ సీఎం కేసీఆర్‌కు తనే లేఖ రాసినట్టు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. 15రోజుల కిందటే ఆ లేఖ రాసినట్టు చెప్పారు. అయితే ఆ లేఖ బహిర్గతం కావడం పట్ల కుట్ర దాగి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. అయితే ఇటీవల కవిత అమెరికాకు వెళ్లారు. తిరిగి ఆమె శుక్రవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించి, కేసీఆర్‌కు రాసిన లేఖపై కవిత స్పష్టత ఇచ్చారు. తను రాసిన లేఖపై తీవ్రంగా చర్చ జరుగుతుందని.. అయితే ఆ లేఖ తానే రాసినట్టు ఒప్పుకున్నారు. ఇటీవల తాను సగం తెలంగాణ తిరిగినట్టు చెప్పారు. ఆయా సందర్భాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు చెప్పిన విషయాలనే లేఖలో పొందుపరిచినట్టు తెలిపారు. ఈ లేఖలో తన సొంత ఏజెండా ఏమీ లేదని, ప్రతి మీటింగ్ జరిగినప్పుడు కేసీఆర్‌కు లేఖ రాస్తానని చెప్పారు. అందులో భాగంగానే ఈసారి కూడా రాసినట్టు తెలిపారు. ఈ లేఖలో ప్రత్యేకత ఏమీ లేదన్నారు. అయితే ఎప్పుడూ లేనిది.. ఈసారి లేఖ బహిర్గతం అయింద న్నారు. కేసీఆర్ కూతురినైనా తాను అంతర్గతంగా రాసిన లేఖ బయటకు వస్తే.. ఇక మిగితా 2వ పేజీలో

## హైదరాబాద్‌లో అంతర్జాతీయ సిరిధాన్యాల కేంద్రం

- ఏర్పాటుకు రూ.250 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- వెల్లడించిన కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఇకార్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) ప్రాంగణంలో అంతర్జాతీయ సిరిధాన్యాల నైపుణ్య కేంద్రాన్ని (గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్) ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం అధికారికంగా వెల్లడైంది. ఈ ప్రతిష్ఠాత్మక కేంద్రం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.250 కోట్లు మంజూరు చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల మంజూరు విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తనకు రాసిన లేఖ ద్వారా తెలియజేశారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన భారతదేశం కోసం ఆహార, పోషకాహార భద్రతను సాధించే లక్ష్యంతో సిరిధాన్యాల ఉత్పత్తిని, వినియోగాన్ని ప్రోత్సహించే పీఎం శ్రీ అన్న యోజన (మిల్లెట్స్)లో భాగంగా ఈ చొరవ తీసుకున్నట్లు ఆయన వివరించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ఈ నూతన అంతర్జాతీయ నైపుణ్య కేంద్రం ద్వారా ఐఐఎంఆర్‌లో జరుగుతున్న పరిశోధనలకు మరింత ఊతం లభిస్తుంది. మిగితా 2వ పేజీలో

## 'నేషనల్ హెరాల్డ్' కేసులో సీఎం రేవంత్ పేరు..!



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ఈ కేసులో దర్యాప్తు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. కోర్టులో తాను దాఖలు చేసిన చార్జిషీటులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును చేర్చినట్టు తెలుస్తున్నది. ఆయనతో పాటు పవన్‌కుమార్ బన్సల్, దివంగత నాయకుడు, సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్‌పటేల్‌ల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి. వీరు రాజకీయ ప్రయోజనాలు, పదవులు వంటి హామీలతో.. యంగ్ ఇండియా సంస్థకు నిధులు రాబట్టారని ఈడీ ఆరోపిస్తున్నది. రేవంత్‌రెడ్డి రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో యంగ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌కు పలువురి నుంచి ఈ విధంగా నిధులను రాబట్టారని ఈడీ వివరించింది. దర్యాప్తు సంస్థ తన చార్జిషీట్‌లో వీరి పేర్లు చేర్చినప్పటికీ.. నిందితులుగా మాత్రం పేర్కొనలేదు. నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌లతో పాటు మరో ఐదుగురు పేర్లను ఈడీ ఇప్పటికే తన చార్జిషీట్‌లో నిందితులుగా చేర్చిన విషయం విదితమే.

## రేవంత్ రెడ్డిపై ఎన్డీఏ చర్యలు తీసుకుంటుందా..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. దర్యాప్తు సంస్థలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తు న్నాయన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసు ఛార్జీషీటులో బ్యాగ్ మ్యాన్(రేవంత్ రెడ్డి) పేరును ఈడీ చేర్చింది. యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తామని ప్రలోభపెట్టారని అందులో పేర్కొంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ సారైనా రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకుంటుందా..? లేదా అమృత్ పథకం వంటి స్కామ్‌ల తరహాలో వదిలి పెడుతారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికలమైంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

## తప్పు చేయనప్పుడు ఉలికిపాటు ఎందుకు..?



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చేందుకే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలాంటి తప్పు చేయనప్పుడు నోటీసులు అందుకున్నంత మాత్రాన ఉలికిపాటు ఎందుకని ఆయన బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో మంత్రి స్పందించారు. హైదరాబాద్ సచివాలయంలో మంత్రి సీతక్కతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జ్యుడీషియల్ కమిషన్ నోటీసులు అందిన వెంటనే దానిని తప్పుబడుతూ మాట్లాడటం విచారకరమని అన్నారు. గతంలో ఇందిరాగాంధీ వంటి ప్రముఖులు సైతం విచారణ కమిషన్ల ముందు హాజరైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నోటీసులు ఇచ్చాక, చట్టబద్ధంగా ఏర్పాటైన జ్యుడీషియల్ కమిషన్‌నే కించపరిచేలా మాట్లాడటం సరికాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకునేందుకే ఈ కమిషన్‌ను వేశామని ఆయన పునరుద్ఘాటించారు.మేడిగడ్డ వద్ద బాంబులు వేశారని కొందరు ఆరోపిస్తున్నారని, ఆ సమయంలో వారే ప్రభుత్వంలో ఉన్నారని మంత్రి గుర్తుచేశారు. "ఒకవేళ నిజంగానే మేడిగడ్డ వద్ద బాంబులు వేసి ఉంటే, అప్పటి ఎఫ్ఐఆర్‌లో ఆ విషయం ఎందుకు నమోదు చేయలేదు అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఒక 'తెల్ల ఏనుగు'తో పోలుస్తూ కాగ్ తన నివేదికలో పేర్కొందని మంత్రి తెలిపారు.కేవలం కొందరు బీఆర్ఎస్ నేతలు తమ జేబులు నింపుకోవడానికే మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని మార్చారని ఆయన ఆరోపించారు. డీపీఆర్‌లో సూచించిన ప్రదేశానికి బదులుగా మరోచోట ప్రాజెక్టును నిర్మించడం వల్లే వ్యయం విపరీతంగా పెరిగిపోయిందని, అయితే అదనపు ఆయకట్టు మాత్రం నామమాత్రంగానే పెరిగిందని వివరించారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు ప్రాంతాన్ని మార్చారని ఆయన దుయ్యబట్టారు.కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తులో పెద్ద ఆర్థిక భారంగా మారబోతోందని కేంద్ర ప్రభుత్వ సంస్థలు ముందుగానే హెచ్చరించాయని మంత్రి తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చట్టం కూడా బీఆర్ఎస్ ఎంపీల మద్దతుతోనే పార్లమెంటులో ఆమోదం పొందిందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్, రీడిజైనింగ్, నిర్మాణంలో అనేక లోపాలున్నాయని ఎన్డీఎస్ఏ తన నివేదికలో స్పష్టంగా పేర్కొందని వెల్లడించారు. కూలిపోయిన ఈ ప్రాజెక్టును అద్భుతమని చెప్పడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడంపై తమ ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పునాదుల్లోనే అనేక లోపాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారని ఆయన చెప్పారు. జ్యుడీషియల్ కమిషన్ ముందు హాజరై, తమ వాదనలు ఏమిటో స్పష్టంగా వినిపించాలని ఆయన బీఆర్ఎస్ నేతలకు సూచించారు.

## హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్‌ను గుర్తిస్తున్నాం

- డీజీపీ జితేందర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో స్లీపర్ సెల్స్‌ను గుర్తిస్తున్నామని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. ఉగ్ర కుట్రసూత్రధారి సమీర్ కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. స్లీపర్ సెల్స్ గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉగ్రకుట్రకు ఒక గ్రూప్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేశాయగా.. ఏర్పాటు దశలోనే గ్రూప్‌ని కనిపెట్టి విచ్ఛిన్నం చేసినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ఆపరేషన్‌ను కేంద్ర బలగాలే నిర్వహించాయన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు 300 మంది మావోయిస్టులు లొంగిపోయారని, రాష్ట్రంలో మావోయిస్టులు ఇంకెవరైనా ఉంటే వెంటనే లొంగిపోవాలని కోరారు. ఛత్తీస్‌గఢ్ ఆపరేషన్ కేంద్ర బలగాలు మాత్రమే నిర్వహించాయని డీజీపీ వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటివరకు 300 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మిగిలిన వారు ఇంకెవరైనా ఉంటే లొంగిపోవాలని సూచించారు. మహబూబాబాద, ఖమ్మం జిల్లాల్లో గతంలో వరద వచ్చినప్పుడు ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు చేశామన్నారు. వివిధ విభాగాల్లో 1000 మందికి శిక్షణ ఇచ్చినట్లు ఆయన వివరించారు. ఎన్డీఆర్ఎఫ్ స్థాయిలో రాష్ట్రంలో ఎస్డీఆర్ఎఫ్ పనిచేస్తుందన్నారు.ఇప్పుడు రెండు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశామని డీజీపీ స్పష్టం చేశారు. మిగతా సిబ్బంది శిక్షణలో ఉన్నారని చెప్పారు. వరదలు, విపత్తులు వచ్చినప్పుడు వరద బాధితులను రక్షించేందుకు ఎస్డీఆర్ఎఫ్ పని చేస్తోందన్నారు. ఎస్డీఆర్ఎఫ్ బృందం ఎన్డీఆర్ఎఫ్‌లోని వివిధ విభాగాలు ఐదు రాష్ట్రాల్లో శిక్షణ పొంది సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని డీజీపీ చెప్పారు. వరదలు వచ్చినప్పుడు ఎస్డీఆర్ఎఫ్ చేపట్టే సహాయ చర్యలపై హుస్సేన్‌సాగర్ జలాల్లో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అదనపు డీజీలు మహేశ్ భగవత్, సంజయ్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్సీ కవిత లేఖ ఉత్తదే

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కవిత లేఖ ఉత్తదేనని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎద్దేవా చేశారు. కెసిఆర్‌కు సలహా ఇచ్చే స్థాయిలో కవిత ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఈ లేఖ ఒక జోక్ అయ్యిందని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి పార్టీపై ఎంతసేపు మాట్లాడాలో కవిత డిసైడ్ చేస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. కెటిఆర్, హరీశ్ రావులే ఈ లేఖ తయారు చేయించారని ఆయన ఆరోపించారు. ఆ లేఖను కవిత పేరుతో బయటకు వదిలారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలే ఆ లేఖను సృష్టించారంటూ కొందరు ఆరోపిస్తున్నారని అలా చేయడం తమకు అవసరం లేదన్నారు.బిఆర్ఎస్ పార్టీలో ఎలాంటి విబేధాలు లేవని, పక్కా ప్లాన్ ప్రకారమే అన్ని పార్టీలను గందరగోళం నెట్టేందుకు వారు ఆడుతున్న నాటకమని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేయడం ఖాయమని ఈ లేఖతోనే బిఆర్ఎస్, బిజెపి బంధం బయటపడిందని ఆయన చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ సభతో బిఆర్ఎస్ పని అయిపోయిందని తేలిపోయిందన్నారు. అందుకే ఈ డ్రామాలని అని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం అయ్యిందని, వంద జాకీలు పెట్టినా లేవదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎద్దేవా చేశారు.



## పసికందును బావిలో పడేసి చంపేసిన తల్లి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

80 రోజుల పసికందును బావిలో పడేసి చంపేసింది తల్లి. ఈ ఘటన మెదక్ జిల్లా, దుబ్బాక మండలం, అప్పనపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకోగా.. పసికందు మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. ఇంటి ముందు ఆడిస్తున్న పసికందును ఇద్దరు దుండగులు మిగితా 2వ పేజీలో

# మహిళల హక్కుల్లో ప్రసూతి సెలవులు కీలకం

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళలకు ప్రసూతి సెలవులను దేశ అత్యున్నత న్యాయస్థానం మరోసారి సమర్థిం చింది. వారు మాతృత్వపు లబ్ది, సంతానం పొందే హక్కుల్లో ఇవి అత్యంత కీలకమైనవని అభివర్ణిం చింది. ఏ సంస్థ స్త్రీలకు ఉన్న ప్రసూతి సెలవు హక్కును హరించలేదని న్యాయస్థానం వెల్లడిం చింది. తమిళనాడుకు చెందిన ఓ ప్రభుత్వ ఉపా ధ్యాయినికి రెండో వివాహం అనంతరం బిడ్డకు జన్మనిచ్చేందుకు ప్రసూతి సెలవులు నిరాక రించారు. దీంతో ఆమె అత్యున్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. తన మొదటి వివాహం నుంచి ఇద్దరు బిడ్డలకు జన్మనివ్వడంతో.. తాజాగా మరోసారి ప్రసూతి సెలవులకు నిరాకరిం చినట్టు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్ర నిబంధనల ప్రకారం తొలి ఇద్దరు పిల్లలకు మహిళలు ప్రసూతి లబ్ది పొందే అవకాశం ఉంది. తాను రెండో వివాహం చేసుకున్న అనంతరం ప్రభుత్వ ఉద్యోగంలో చేరినట్టు ఆ ఉపాధ్యాయిని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు.. తన రెండు కాన్పులకు ఎటువంటి ప్రసూతి సెలవులు వాడుకోలేదన్నారు. ఈ సందర్భంగా ఆమె తరఫున న్యాయవాది కేవీ ముత్తుకుమార్ స్పందిస్తూ.. ఆమె ప్రాథమిక హక్కులను హరించేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఉందన్నారు.

# ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గెల్లిలో ఏర్పాటు చేసిన శ్రీ బసవేశ్వర మహారాజ్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి గఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, బసవన్న గారి స్పూర్తితోనే రాష్ట్రంలో కుల గణన చేపట్టామని అన్నారు. బసవేశ్వరుడు సామాజిక న్యాయం అందించేందుకు ఎంతో కృషి చేశారని విశ్వగురు విధానాలను ముఖ్యమంత్రి గారు స్మరించుకున్నారు. బసవన్న గారి స్ఫూర్తి సందేశానికి అనుగుణంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, వారి సందేశమే పరిపాలనకు సూచిక అని అన్నారు. పేదలకు న్యాయం జరగాలని ఆనాడు అనుభవ మంట పాల ద్వారా తెలుసుకున్న విశ్వగురు ఆదర్శంగానే ప్రస్తుతం పార్లమెంట్, శాసనస భలు నిర్వహించుకుంటున్నామని వివరించారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా గారు, కొండా సురేఖ గారు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు, ఎంపీ సురేష్ షెట్కర్ గారితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గడ్చిరోలిలో మళ్లీ ఎన్‌కౌంటర్

- **నలుగురు మావోయిస్టులు మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్**

మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గడ్చిరోలి జిల్లాలోని భ్రమాగఢ్ తాలూకాలో గడ్చిరోలి జిల్లా పోలీస్–సీ60 స్పెషల్ టీమ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది శుక్రవారం కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు, పోలీసులకు మధ్య దాదాపు 36 గంటలపాటు సాగిన ఎదురుకాల్పుల్లో భ్రమాగఢ్ దళం కమాండర్‌తో పాటు ముగ్గురు దళ సభ్యులతో కలిపి నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. వీరివద్ద ఒక ఎస్ఎల్, రెండు 303 రైఫిల్స్, ఒక భార్మార్ సహా మొత్తం 4 తుపాకులు, సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులను రూపుమాపేందుకు భ్రమాగఢ్ సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల కొత్తగా పోలీస్‌స్టేషన్‌ను నిర్మిం చారు. దీనిపై మావోయిస్టులు దాడి చేయాలనుకుంటున్నట్టు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి భద్రతాదళాలకు సమాచారం అందింది.

దాంతో గడ్చిరోలి అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఎం రమేష్ ఆధ్వర్యంలో సీ60 పోలీస్ ఫోర్స్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్‌లోని 12 బృందాలు, సీఆర్‌పీఎఫ్ 113 బెటాలియంకు చెందిన పోలీసు బృందాలు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ఇంద్రావతి నది ఒడ్డున కూంబింగ్ ఆపరేషన్ కోసం గురువారం కవాండే, నెలగొండ పరిసర అడవికి హుటాహుటిన బయలు దేరాయి. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి అడవిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు జరిగాయి.

ఈ కాల్పుల్లో మృతిచెందిన వారిని.. భామ్రాఘడ్ తాలూకా కవాండే గ్రామానికి చెందిన భామ్రాఘడ్ దళం కమాండర్ సన్ను మాసా పుంగటి(35), దళ సభ్యులు అశోక్ అలియాస్ సురేష్ పోరియా వడ్డే(38), గంగలూరు ఏరియా పోడియాకు చెందిన విజో అలియాస్ విజో హెూయామి(25), భామ్రాఘడ్ గోంగువాడకు చెందిన కరుణ అలియాస్ మమిత అలియాస్ తుని పాండు వర్సే(21)గా గుర్తించారు. కాగా, చనిపోయిన ఈ నలుగురు మావోయిస్టులపై మొత్తం రూ.14లక్షల రివార్డు ఉన్నట్టు తెలిసింది.

## పసికందును బావిలో పడేసి చంపేసిన తల్లి

(మొదటి పేజీ తరువాయి)

అపహరించారని కన్నతల్లి పోలీసులను తప్పుదోవ పట్టించింది. చివరికి విచారణలో తానే తన కన్న కొడుకును బావిలో వేసి చంపినట్లు అంగీకరించడంతో శుక్రవారం పోలీసులు ఆమెను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. దుబ్బాక సిఐ పాలెపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం, పుల్లూరు గ్రామానికి చెందిన రామగళ్ళ శ్రీమాన్.. నంగునూరు మండలం, నర్మెట్టకు చెందిన కవితను మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకొని పుల్లూరులోనే నివాసం ఉంటున్నారు. శ్రీమాన్ ఇటీవల రెండు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి రావడంతో గ్రామంలో పరువు పోయిందని, అతని అమ్మమ్మ ఊరైన అప్పనపల్లిలో గత రెండు నెలలు నుంచి ఉంటున్నారు. ఎంతో ఆనందంగా ఉంటుందనుకున్న జీవితం ప్రశ్నార్థకంగా మారడంతో పాటు ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తరచూ వేధింపులకు గురిచేస్తుండటం, ఆర్థిక ఇబ్బందులు, భర్త ప్రవర్తన, వ్యవహార శైలి నచ్చని ఆమె భర్తతో విడిపోవడానికి సిద్ధపడింది. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న పసికందును తప్పిస్తే.. భర్తను విడిచిపెట్టి హాయిగా ఉండొచ్చని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పసికందు దీక్షిత్ కుమార్‌ను తీసుకెళ్లి గ్రామశివారులో ఉన్న పాడుబడిన వ్యవసాయ బావిలో విసిరేసి వెళ్లిపోయింది. తన దగ్గర నుంచి ఇద్దరు ముసుగు వేసుకొని వచ్చిన దుండగులు బాబును ఎత్తుకెళ్లారని చెప్పి, అందరినీ తప్పుదోవ పట్టిస్తూ కిడ్నాప్ జరిగినట్టుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆమె చెబుతున్న విషయాలకు, జరిగిన ఘటనకు పొంతన లేకపోవడంతో తమదైన శైలిలో విచారించారు. భర్త నుంచి విడిపోయి దూరంగా వెళ్లిపోవాలని, అడ్డుగా ఉన్న కుమారుడిని తానే బావిలో వేసి చంపినట్లు అంగీకరించింది. దీంతో ఆమె భర్త శ్రీమాన్ ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసును హత్య కేసుగా మార్చిన పోలీసులు కవితను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

## తొమ్మిదో రోజు సరస్వతి పుష్కరాలు

**బలగం టీవీ, హైదరాబాద్**



కాళేశ్వరం త్రివేణి సంగమంలోని అంతర్వాహిని సరస్వతి నది పుష్కరాలు తొమ్మిదో రోజుకు ఘనంగా సాగాయి. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో త్రివేణి సంగమం భక్తులతో పోటెత్తింది. పుణ్యస్నానాలు చేసేవారు ఇక్కడ ఉన్న అమ్మవారు, స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. తొమ్మిదో రోజు వేలాది మంది భక్తులు సరస్వతి నదిలో పుణ్యస్నానం చేశారు. ఈ స్నానం ద్వారా పాపాలు తొలగిపోతాయని, శరీర –మనస్సు శుద్ధి కలుగుతుందని విశ్వాసం. వేద పఠనాలు, హెూమాలు: పుణ్యక్షేత్రాల్లో వేదపఠనాలు, హెూమాలు నిర్వహించారు. ఇవి సరస్వతీ దేవిని ఆరాధించేందుకు జరిగే ముఖ్యమైన ఆచారాలు. విద్యా దేవత అయిన సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని ప్రణమించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. పోలీస్ మరియు వాలంటీర్ల సహాయంతో ఘాట్ల వద్ద ఏర్పాట్లు బాగా నిర్వహించారు. సంస్కృతిక కార్యక్రమాలు, హరిదాసుల సంగీత సేవలు, భజనలు కూడా కొనసాగాయి.

పుష్కర స్నానం అనంతరం గోదావరి మాతకు మహిళలు పూజలు చేశారు. పసుపు, కుంకుమ, పువ్వులు, కొబ్బరికాయలు తదితర పూజా సామగ్రితో పూజలు చేశారు. పుష్కరఘాట్ వద్ద పెద్దలకు తర్పణాలు ఇస్తున్నారు. పుణ్యస్నానాలు అనంతరం చిన్నారులు, విద్యార్థులతో ఏకశిల సరస్వతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు.

అరణ్య శైవక్షేత్రంగా పేరొందిన శ్రీకాళేశ్వరం ముక్తీశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఉత్తర ద్వారం, తూర్పు ద్వారం ద్వారా భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో రూ.వంద టికెట్ ద్వారా శీఘ్ర దర్శనం రద్దు చేయడంతో అందరికి సర్వదర్శనం కల్పించారు. దివ్యాంగులను సిబ్బంది వీల్ చైర్ల ద్వారా దర్శనానికి తీసుకు వెళుతున్నారు.

## హైదరాబాద్‌లో అంతర్జాతీయ సిరిధాన్యాల కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన పరిశోధన ప్రయోగశాలలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, విస్తరణ కేంద్రాలను ఇక్కడ నెలకొల్పుతారు. ముఖ్యంగా తెలంగాణ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి, సిరిధాన్యాల సాగును ప్రోత్సహిస్తారు. రైతులకు క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వడం, విలువ ఆధారిత ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మద్దతు, ఈ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపడతారు," అని తెలిపారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కూడా ఉన్న కిషన్ రెడ్డి, ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

కేంద్ర వ్యవసాయ మంత్రి చౌహాన్ తన లేఖలో ఈ నైపుణ్య కేంద్రం యొక్క ప్రధాన ఉద్దేశాలను ప్రస్తావించారు. సిరిధాన్యాల జన్యు బ్యాంకును బలోపేతం చేయడానికి, పరిరక్షణ, నిర్దిష్ట లక్షణాల గుర్తింపు, పంట అభివృద్ధి కోసం సిరిధాన్యాల జీవవైవిధ్యాన్ని ఉపయోగించుకోవడానికి ప్రపంచస్థాయి జన్యు పదార్థాల మధ్యకాలిక నిల్వ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం వీటిలో ఒకటి. దిగుబడి, ఉత్పాదకతను పెంచడానికి సిరిధాన్యాల లక్షణాలు, విత్తనాలు, పంట అభివృద్ధి కోసం ఇది ప్రపంచ సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ నైపుణ్య కేంద్రం సిరిధాన్యాల కోసం పోషకాహార తృణధాన్యాల విశ్లేషణ, ఆహార భద్రత, నాణ్యత హామీ జాతీయ ప్రయోగశాలగా కూడా పనిచేస్తుంది. వ్యవస్థాపకత, ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల పెంపుదల కోసం సిరిధాన్యాల విలువ ఆధారిత శ్రేణికి అంతర్జాతీయ నైపుణ్య కేంద్రంగా కూడా ఇది సేవలందిస్తుందని కేంద్ర వ్యవసాయ మంత్రి తన లేఖలో వివరించారు.

## లేఖ నేనే రాశా

(మొదటి పేజీ తరువాయి)

సామాన్యుల పరిస్థితి ఏమిటో ఆలోచించాలన్నారు. దీనిపై పార్టీలో కూడా చర్చ జరగాలని తెలిపారు. పార్టీలో తనపై కుట్ర జరగుతోందని ఇటీవల ప్రెస్‌మీట్‌లో కూడా చెప్పినట్టు గుర్తు చేశారు. పార్టీలో కోవర్టులు ఉన్నారని చెప్పారు. కేసీఆర్ దేవుడని, కానీ ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. లేఖ బహిర్గతం వెనుక ఎవరున్నారో తెలియాలన్నారు. వారి వల్ల పార్టీకి తీవ్రమైన నష్టం జరుగుతోందన్నారు. వారిని పక్కన పెట్టి, పార్టీలో ఉన్న చిన్న చిన్న లోపాలను సవరించుకుంటే.. పార్టీ పది కాలాల పాటు చల్లగా ఉంటుందని తెలిపారు. తమ నాయకుడు కేసీఆరేనని, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ బాగుంటుం దన్నారు. వ్యక్తిగతంగా తనకు ఎవరిపై ద్వేషం కానీ ప్రేమ కానీ లేదన్నారు. తమ కుటుంబంలో, పార్టీలో ఎలాంటి విభేధాలు లేవని చెప్పారు. లేఖ బహిర్గతం కావడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు సంబురపడుతున్నాయని, బీఆర్ఎస్ ఆగమైనట్టు ఆ పార్టీల నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదని, అవి పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు.

## ఎమ్మెల్సీ కవిత లేఖ అంతర్గత విషయం

- **కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ పూర్తి అంతర్గత విషయం అని.. దానికి అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఓ మునిగిపోతున్న నావ అని అన్న ఆయన.. అలాంటి పార్టీలో ఇలాంటి ఘటనలు జరగడం మామూలే అని పేర్కొన్నారు. డాడీ–డాటర్ ఉత్తరం ఓ డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత ఎందుకు ఉత్తరం రాశారు తనకు తెలియదని.. కానీ, కెసిఆర్, కవితల మధ్య మాటలు లేవని ఉత్తరం ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. కుటుంబ పార్టీలు దేశానికి ప్రమాదకరమని అన్నారు. కెసిఆర్ సొంతపార్టీ ఎమ్మెల్యేలనే దగ్గరకు రానీవ్వరు అని కిషన్ తెలిపారు. 14 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న తనకే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. కేంద్రమంత్రి అయ్యాక కూడా కెసిఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని మండిపడ్డారు. పార్టీ కేడర్‌ను కెసిఆర్ కలవట్లేదని స్వయంగా కవిత తనతో చెప్పిందని. బీఆర్ఎస్ పార్టీ డాడీ, డాటర్, సన్, సన్–ఇన్ లా.. పార్టీ అని విమర్శించారు.

## నేడు నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి హాజరవుతున్నారు. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, అర్బనైజేషన్‌లో ముందున్న తెలంగాణ వాటిల్లో మరింత వేగంగా ముందుకు పోయేందుకు చేపడుతున్న చర్యలను వివరించనున్నారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పన, సమగ్రాభివృద్ధిలో భాగంగా రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, డ్రైపోర్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూని వర్సిటీ, ఐటీఐలను ఏటీసీలుగా మార్పు, యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో యూనివర్సిటీల ఏర్పాటుపై ప్రభుత్వం తీసుకున్న చొరవ ను గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ముందు వివరిస్తారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి చేసిన రుణమాఫీ, వరికి బోనస్, సంక్షేమంలో భాగంగా అందిస్తున్న సన్న బియ్యం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ. 500 కే సిలిండర్ సరఫరా వంటి రాష్ట్రంలో నిరుపేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తారు. సామాజిక సాధికారతలో భాగంగా ఎస్సీ కులాల ఉప వర్గీకరణ, కుల గణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని శాసనసభలో తీర్మానించిన అంశాలనూ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు.

## నేడు పాలిసెట్ ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ఈనెల 13న నిర్వహించిన టిజి పాలిసెట్ ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు పాలిసెట్ ఫలితాలను విడుదల చేయనున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్‌బిటెట్) కార్యదర్శి బి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో ఈ ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పాలిసెట్– 2025కు మొత్తం 1,06,716 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 98,858 మంది పరీక్ష రాశారు.

## వచ్చే దసరా, దీపావళిలు

# నూతన గృహంలో చేసుకోవాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, గంభీరావుపేట**



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు 30 రోజులు లోగా ప్రారంభించి వచ్చే దసరా దీపావళి పండుగలు నూతన గృహములలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. బుధవారం కలెక్టర్ గంభీరావుపేట మండలం లో రెండో విడత క్రింద 507 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు దత్తసాయి ఫంక్షన్ హాల్లో కేకే మహేందర్ రెడ్డి తో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ గంభీరావుపేట మండలం లో రెండో విడత కింద 507 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందనిఅన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2లక్షల రూపాయలు,ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయనిఅన్నారు.

**పైరవీలు అవసరం లేదు.**

ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయవలసిందిగా స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని అన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని అన్నారు. మండలంలో ఉన్న గ్రామాలకు ఇసుక రీచ్ లను అలాట్ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ సెక్రెటరీ నుండి తాసిల్దారి కి సమాచారం అందిస్తే వారే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారని, ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా విడుదల ఎంపిక చేస్తామనిఅన్నారు.

30 రోజుల లోగా నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించాలని లేని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ సొంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి హన్మంతు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ విజయ, ఎంపీడీవో రాజేందర్, తాసిల్దార్ మారుతి రెడ్డి , ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

**-రిమాండ్ కి తరలింపు..**

**-సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ.**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ బోయినిపల్లి మండలము జగ్గారావు పల్లి గ్రామానికి చెందిన కొమురయ్య తన భార్య తో కలసి పది రోజుల క్రితం సిద్దిపేటలో ఉన్న తన బంధువుల పెళ్ళికి వెళ్తుండగా సిరిసిల్ల బస్ స్టాండ్ లో భార్య హాండ్ బ్యాగ్ లో నుండి బంగారం, డబ్బును గుర్తు తెలియని దొంగలు దొంగిలించారని తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినామని అన్నారు.దర్యాప్తులో భాగంగా బస్ స్టాండ్ లో ఉన్న సీసీ కేమేరాల ఆధారంగా నిందితుని శుక్రవారం సిరిసిల్లలోని పెద్దబజారులోని శివాలయం వద్ద అదుపులోకి తీసుకొని దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరగిందన్నారు.



# పదోన్నతులు పోలీసులకు బాధ్యతను పెంచుతాయి

**-ఎస్పీ మహేష్ బి గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని, అలాగే పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయని ఎస్పీ మహేష్ బి గితే అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐ లుగా పదోన్నతి పొందిన శంకర్(సిరిసిల్ల టౌన్ ప్రస్తుతం), లక్పతి(వేములవాడ రూరల్),మోతీరం(బోయినపల్లి) లను ఎస్పీ మహేష్ బి గితే అభినందించినారు.ఈసందర్భంగా ఎస్పి మహేష్ బి గితే మాట్లాడుతూ పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలనిఅన్నారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు,గౌరవ మర్యాదలు లభిస్తాయని అన్నారు.

# నకిలీ విత్తనాల రవాణా, ఉత్పత్తి విక్రయాలపై ప్రత్యేక నిఘా

**- ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా,రవాణా, ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం అందింతే తక్షణమే ప్రజల మరియు రైతులు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ మహేష్ బి. గితే ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ వానాకాలం సాగు ప్రారంభమవుతున్న వేళను దృష్టిలో వుంచుకోని రైతన్న నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యలకై జిల్లా పోలీసులు సిద్ధంగా ఉందని, నకిలీ విత్తనాల సరఫరా,ఉత్పత్తి,అమ్మకాలు అరికట్టడానికి వ్యవసాయ శాఖ,జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తరచు తనిఖీలు చెప్పట్టడం జరుగుతుందన్నారు.

జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి పోలీస్,వ్యవసాయ అధికారులచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని,గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారియెక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందన్నారు.నకిలీ విత్తనాలు కలిగి ఉన్నా, అమ్మిన,రవాణా చేసే వ్యక్తుల పై క్రిమినల్ కేసులు,పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు.

జిల్లాలో ఒక్క రైతుకు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ, పోలీసు అధికారులు పై ఉంటుందని,జిల్లా పరిధిలో ఉన్న ఫర్టిలైజర్ షాప్, సీడ్స్ షాప్స్ లపై నిఘా ఉంచి ఆకస్మిక తనికిలు చేస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను,రవాణాను అడ్డుకట్ట వేయడం జరుగుతుందని,రైతులు సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్ నుండి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు.

జిల్లా ప్రజలకు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు,నకిలీ పురుగుల మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే డయల్100 కి లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలిపారు.



# రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ...

**బలగం టీవీ, సిరిసిల్ల**

మే 30 న ఖతార్ దేశంలో తెలంగాణ గల్ఫ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల పోస్టర్ ను తెలంగాణ లో తెలంగాణ ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, ఖతార్ లో గల్ఫ్ సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఖతార్ మే 30 శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుండి డీపీస్ మోనార్క్ స్కూల్ ప్రారంభం కానున్నాయని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీనివాస్, తెలంగాణ ఎన్నారై అడ్వాయిజరి బోర్డ్ మెంబర్లు సింగిరెడ్డి నరేష్ ,తెలంగాణ గల్ఫ్ సమితి వ్యవస్థాపకులు గుగ్గిళ్ల రవి గౌడ్ హాజరు కానున్నారని, తెలుగు వారందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ గల్ఫ్ సమితి సభ్యులు పిలుపునిచ్చారు.

# ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురి మృతి

**బలగం టీవీ, అమరావతి**

ఏపీలోని ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఒక లారీ, కారును బలంగా ఢీకొన్న ఘటనలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మరో ఇద్దరు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని కొమరోలు మండలం తాటిచెర్లమోటు సమీపంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. బాధితులంతా నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రాన్ని దర్శించుకుని తిరిగి తమ స్వస్థలానికి వెళుతుండగా ఈ ప్రమాదం బారిన పడ్డారు.బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మహానంది దర్శనం కోసం కారులో వెళ్లారు. దైవదర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో, ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్దకు రాగానే, ఎదురుగా వేగంగా వస్తున్న లారీ వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు అయింది.ప్రమాదంలో గజ్జల అంకాలు (50), గజ్జల జనార్ధన్, గజ్జల భవాని (20), గజ్జల నరసింహ (20), సన్నీ అక్కడికక్కడే మృతి చెందారు. మరణించిన వారిలో మరొకరి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. గాయపడిన వారిని జీతన్, శిరీషగా గుర్తించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

# తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి..

**-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్**

**బలగం టీవీ, సిరిసిల్ల**




అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్నటువంటి రైతుల ధాన్యం తీవ్రంగా తడిసి మొలకెత్తడం జరిగిందని,తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు కన్నీరుపెడుతున్నారని అన్నారు. ప్రతి సీజన్లో పంట పండించిన రైతుకు, పంట ప్రభుత్వం కొనుగోలు చేసేదాకా పంటకు ఎప్పుడు ఏమైతదో అని భయం గుప్పిట్లో బతకవలసిన పరిస్థితి ఈ ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నా రైతుల బతుకుల్లో ఎలాంటి మార్పు జరగడం లేదని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల జెండాలు వేరైనా మోసాలు,విధానాలు ఒకటే అని, రైతే రాజు అని,రైతులను మోసం చేసి రైతుల ఓట్లతో అధికారం లోకి వస్తున్నాయని అన్నారు. రైతులు పండించిన పంటకు నష్టం జరగకుండా ముందస్తుగా ప్రణాళిక చేయకపోవడంతోనే ప్రతి పంట సీజన్ లో వర్షాలతోటి రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా రైతులకు నష్టాలు జరగకుండా పండిన పంటను వెంటనే కొనుగోలు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు ఈ సమావేశంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి కోడం రమణ పాల్గొన్నారు.



# సెమీఫైనల్‌కు కిడాంబి శ్రీకాంత్

**బలగం టీవీ, హైదరాబాద్**


ప్రతిష్ఠాత్మక మలేషియా మాస్టర్స్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లో జయకేతనం ఎగురవేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన తొమా జూనియర్ పొపోవ్‌ను మట్టికరిపిస్తూ సెమీస్‌కు దూసుకెళ్లాడు. పస్తుతం 65వ ర్యాంక్‌లో కొనసాగుతున్న శ్రీకాంత్ సంచలన ఆటతో వరుసపెట్టి ప్రత్యర్థులకు చెక్ పెడుతున్నాడు. ప్రీ- క్వార్టర్స్‌లో ఆరో సీడ్‌ను చిత్తు చేసిన అతడు .. ఈసారి 18వ ర్యాంకర్‌ను ఇంటిదారి పట్టించాడు. మూడు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ పట్టు విడవలేదు. తొలి సెట్ తర్వాత ప్రత్యర్థి పుంజుకున్నా తన పోరాట పటిమతో ఆకట్టుకున్న భారత స్టార్ చివరకు 24-22, 17-21, 221-20తో విజేతగా నిలిచాడు. తదుపరి రౌండ్‌లో శ్రీకాంత్‌కు జపాన్‌కు చెందిన యుషీ తనక రూపంలో కఠినమైన సవాల్ ఎదురుకానుంది.



# యువ షూటర్ అద్రియాన్‌కు కాంస్యం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల అదరగొడుతున్నారు. శుక్రవారం యువ షూటర్ అద్రియాన్ కర్మాకర్ కాంస్యం సాధించాడు. 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్స్‌లోకి కంచు మోత మోగించి రెండో మెడల్ ఖాతాలో వేసుకున్నాడు. తొలిసారి వరల్డ్ కప్‌లో పోటీ పడుతున్న ఈ కుర్ర షూటర్ గురువారం 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో రజత పతకం గెలుపొందిన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో అద్రియాన్ అదరగొట్టాడు. 41వ షాట్‌లో 10.8, 42వ షాట్‌లో 10.6 మీటర్లతో మూడో స్థానంలో నిలిచాడు. అద్రియాన్ కాంస్యంతో భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానం నిలబెట్టుకుంది. మహిళల త్రీపిస్టల్ విభాగంలో 17 ఏళ్ల అనౌష్క తోకుర్ 7వ స్థానంతో సరిపెట్టుకుంది.



# జూన్ 6న సంగీత్ శోభన్ 'గ్యాంబ్లర్స్'

**బలగం టీవీ, హైదరాబాద్**

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న యువ హీరో సంగీత్ శోభన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కేసీఆర్ ఫేమ్ రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత, జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో 'శ్రీవల్లి' అనే సైన్స్ ఫిక్షన్ సినిమాను నిర్మించిన సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు ఈ చిత్రాన్ని రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై నిర్మిస్తున్నారు. కేఎస్‌కే చైతన్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు.

# ఆర్సీబీ టాప్2 ఆశలపై నీళ్లు

- ఆర్సీబీకి షాకిచ్చిన సన్‌రైజర్స్
- 42 పరుగులతో గెలుపు



**బలగం టీవీ, హైదరాబాద్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ షాకిచ్చింది. టాప్2లో నిలుద్దామనుకున్న ఆర్సీబీ ఆశలపై నీళ్లు చల్లింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 42 పరుగుల తేడాతో హైదరాబాద్ గెలుపొందింది. ఈ ఓటమితో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి పడిపోయింది. పంజాబ్ కింగ్స్ జట్టు రెండో స్థానానికి చేరుకుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 231 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 94 నాటౌట్), అభిషేక్ శర్మ(17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34) రాణించారు. ఆర్సీబీ బౌలర్లలో రోమారియో షెపర్డ్(2/14) రెండు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్, లుంగి ఎంగిడి, సుయాష్ శర్మ, కృనాల్ పాండ్యా తలో వికెట్ తీసారు.

అనంతరం ఆర్సీబీ 19.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఫిల్ సాల్ట్(32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 62), విరాట్ కోహ్లీ(25 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 43)టాప్ స్కోరర్లుగా నిలిచారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ప్యాట్ కమిన్స్(3/28) మూడు వికెట్లు తీయగా.. ఇషాన్ మలింగా(2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. జయదేవ్ ఉనాద్కట్, హర్ష్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్ తలో వికెట్ తీసారు.భారీ లక్ష్యచేధనలో ఆర్సీబీకి ఆశించిన శుభారంభం దక్కింది. ఓపెనర్లు విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ దూకుడుగా తమ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు.దాంతో ఆర్సీబీ పవర్ ప్లేలో వికెట్ నష్టపోకుండా 72 పరుగులు చేసింది. ఆ వెంటనే హర్ష్ దూబె బౌలింగ్‌కు రాగా విరాట్ కోహ్లీ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 80 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. మరోవైపు ఫిల్ సాల్ట్ 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే మయాంక్ అగర్వాల్(11) తీవ్రంగా నిరాశపరిచాడు. నితీష్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. జితేశ్ శర్మ వచ్చి రావడంతో భారీ సిక్స్‌లు బాదగా.. రజత్ పటీదార్ అతనికి అండగా నిలిచాడు. 14 ఓవర్లలోనే 163 పరుగులు చేయడంతో ఆర్సీబీ విజయం లాంఛనమేనని అంతా అనుకున్నారు. కానీ 15వ ఓవర్ వేసిన నితీష్ కుమార్ రెడ్డి 4 పరుగులే ఇచ్చి ఆర్సీబీ బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చాడు. దాంతో ఇషాన్ మలింగా వేసిన మరుసటి ఓవర్‌లో ఆర్సీబీ రెండు వికెట్లు కోల్పోయింది. రజత్ పటీదార్ అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌటవ్వగా.. డేంజరస్ రొమారియో షెపర్డ్ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దాంతో ఆర్సీబీ మరింత ఒత్తిడికి గురైంది. చేధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోవడంతో భారీ షాట్లకు ప్రయత్నించి వరుసగా పెవిలియన్ చేరారు. జితేశ్ శర్మ(24)ను ఉనాద్కట్ ఔట్ చేయగా.. టీమ్ డెవిడ్‌ను ఇషాన్ మలింగా, భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్యాలను కమిన్స్ ఔట్ చేశాడు. యశ్ దయాల్‌ను హర్షల్ పటేల్ పెవిలియన్ చేర్చి ఆర్సీబీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

## ఇంగ్లండ్ భారీ స్కోరు... జాంబాబ్వే ఫాలో ఆన్

**బలగం టీవీ, హైదరాబాద్**

నాటింగ్‌హామ్ వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ సాధించింది. 498/3 ఓవర్ నైట్‌స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జాక్ క్రాలీ (171 బంతుల్లో 124 14 ఫోర్లు), బెన్ డకెట్ (134 బంతుల్లో 140 20 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఒలీ పోప్ (163 బంతుల్లో 171, 24 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ శతకాలతో కదం తొక్కగా... హ్యారీ బ్రూక్(58), రూట్(34) పరుగులతో రాణించారు. జింబాబ్వే బౌలర్లలో ముజారబానీ మూడు వికెట్లు పడగొట్టగా.. చివింగా, మాధ వీరే, రజా తలా వికెట్ సాధించారు.కాగా ఇంగ్లండ్ జట్టు తొలి రోజే రికార్డు స్థాయిలో 88 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 498 పరుగులు చేసింది. టెస్టు క్రికెట్‌లో తొలి రోజు నమోదైన రెండో అత్యధిక స్కోరు ఇదే కావడం గమనార్హం. అంతకుముందు 2022లో పాకిస్తాన్‌పై ఇంగ్లండ్ తొలి రోజు 506/4 పరుగులు చేసింది. అనంతరం జింబాబ్వే 265 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దాంతో రెండో ఇన్నింగ్స్‌లో ఫాలో ఆన్ ఆడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 2 వికెట్ల నష్టానికి 30 పరుగులు చేసింది.

## సంధ్య థియేటర్ ఘటన..
## సీపీ సీవీ ఆనంద్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై ఆరు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

## సెన్సార్ బోర్డుపై రామ్ గోపాల్ వర్మ తీవ్ర వ్యాఖ్యలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల్లో అసభ్య పదజాలం, సెన్సార్ బోర్డు తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీవీ మాట్లాడుతూ "సినిమాల్లో బూతులు ఉండకూడదని చాలా మంది వాదిస్తుంటారు. సెన్సార్ బోర్డు కూడా అనేక నిబంధనలు విధిస్తోంది. సినిమాల్లోనే ఇదంతా ఉన్నట్లు మాట్లాడుతున్నారు" అని ఆర్జీవీ అన్నారు. "ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. వాటిలో పోర్న్ వీడియోలు, అత్యంత హింసాత్మక దృశ్యాలు సులువుగా చూస్తున్నారు. అలాంటప్పుడు, వినోదం కోసం తీసే సినిమాల్లో ఇది ఉండొద్దు, అది చూపించొద్దు అనడం ఎలా సమంజసం? ఫోన్లో చూస్తే తప్పు లేనప్పుడు, పెద్ద తెరపై బూతులు చూస్తే తప్పేంటి? ఇలాంటి ఆంక్షలు పెట్టడం నిజంగా అర్థం లేని పని" అని ఆయన అభిప్రాయపడ్డారు. సెన్సార్ బోర్డు పనితీరుపై మండిపడుతూ, "సెన్సార్ బోర్డ్ అనేది ఎప్పుడో కాలం చెల్లిపోయింది (ఎక్స్‌పైర్ అయిపోయింది). అదొక స్టుపిడ్ థింగ్" అంటూ ఆర్జీవీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



## రెండు వారాల్లో'ది రాజాసాబ్' టీజర్

**నిర్మాత ఎస్‌కేఎన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ . మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ నుంచి తాజాగా ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరో రెండు వారాల్లో రాజాసాబ్ టీజర్ రాబోతుందని బేబి నిర్మాత ఎస్‌కేఎన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఒక మూవీ ఈవెంట్‌లో ఆయన వెల్లడించారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.